అందని వేతనం.. దుర్భర జీవనం

- దయనీయంగా ఉపాధి కూలీల పరిస్థితి
- మే31 నుంచి అందని కూలి
- పెండింగ్‌లో రూ.51.25 కోట్లు
- చెల్లించని మెటీరియల్ బిల్లు రూ.60.31 కోట్లు


ఉపాదిహామీ పనులు చేస్తున్న కూలీలు

కార్వేటినగరం: ప్రస్తుతం ఉపాధిహామీ కూలీల వేతనాల వెతలు తారస్థాయికి చేరాయి. మే 31 నుంచి ఇప్పటి వరకు కూలీలు చేసిన పనులకు వేతనాలు అందకపోవడంతో వారి జీవనం ప్రశ్నార్థకంగా మారుతోంది. దీంతో కూలీలు పనులకు రావాలంటే పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సాధారణంగా గతంలో ప్రతి వారం వారికి సంబంధించిన వేతనాలు వారి ఖాతాల్లో జమ అయ్యేది. మూడు నెలలకు పైగా దాదాపు కూలీలకు అందాల్సిన వేతనం రూ.51.25 కోట్లుగా ఉంది. అలాగే మార్చి నుంచి ఇప్పటి వరకు రావాల్సిన మెటీరియల్ బిల్లులు కూడా దాదాపు రూ.60.31 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత పనులు చేసిన వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు అందుతాయన్న విషయం కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హార్టికల్చర్, హౌసింగ్ పనులు మాత్రమే..

ఇంతకు ముందు ప్రతి వారం ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన బిల్లులు వారి ఖాతాల్లో జమ అవుతూ ఉండేవి. అయితే ఒక్క సారిగా మూడు నెలలకు పైగా వేతనాలు అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనప్పటికీ కూలీల ఖాతాల్లో జమ కాకపోవడం గమనార్హం. వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రమే ఉండడంతో అటు వేతనాలు అందక ఇటు జీవనం సాగక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా చెప్పుకొనేంత డిమాండ్ లేక పోవడంతో వారి ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించింది. ఈ నేపథ్యంలో వారి కొనుగోలు శక్తి తగ్గి డబ్బుల కోసం ఇతరులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంటోంది. హార్టికల్చర్ తప్ప మిగతా పనులు కొనసాగడం లేదు. ఎందుకంటే చెరువుల్లో వర్షాల కారణంగా నీళ్లు ఉండడంతో ఈ పనులు జరగడం లేదు. కేవలం హార్టికల్చర్, హౌసింగ్ పనులు మాత్రమే కొనసాగుతుండగా ప్రస్తుతం కూలీల హజరు సంఖ్య జూలై నుంచి క్షీణించింది. ఏప్రిల్, మే నెలల్లో 2 లక్షలకు పైగా హాజరవుతుండగా వేతనాలు అందక పోవడంతో క్రమంగా క్షీణించి రోజుకు 35 వేల మంది కూలీలు మాత్రమే హాజరవుతున్నారు. గత రెండు రోజుల క్రితం మూడు నెలల వేతనాలకు మూడు వారాల బిల్లులు మాత్రం అందించినట్లు సమాచారం.

తగ్గిన కూలీల సంఖ్య

ప్రస్తుతం వేతన జీవుల బిల్లులు దాదాపు రూ.51.25 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు మూడు నెలలకు పైగా వేతనాలు అందకపోవడంతో పనులకు వచ్చేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీలో కూలీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఏప్రిల్, మే నెలలతో పోలిస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా కనిపిస్తోంది. జూలై నుంచి రోజు రోజుకు క్రమంగా కూలీల సంఖ్య తగ్గి ప్రస్తుతం వేలల్లో ఉండే కూలీలు ఇప్పుడు వందలకు తగ్గిపోయారు. హౌసింగ్‌లో సుమారు 87 మంది మాత్రమే రోజుకు హాజరవుతున్నారు. హౌసింగ్‌లో 90 రోజులు పనిదినాలు, హార్టికల్చర్‌లో గుంతలు తీసే పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. వేతనాలు అందక ఈ పనులకు కూడా కూలీలు వచ్చేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఉపాధిహామీ పథకం నిర్వీర్యమవతోంది.

జిల్లా సమాచారం

జాబ్‌కార్డులు	– 2,67,000
వేతనదారులు	– 4,79,000
అవసరానికి అనుగుణంగా హాజరయ్యేవారు	– 2 నుంచి 3 లక్షల మంది
రోజు పని చేస్తున్న కూలీల సంఖ్య	– 35 వేల మంది

ఇబ్బందులు పడుతున్నాం



ఉపాధి హామీ పనులకు వెళ్లి వేతనాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వారానికి ఒకసారి బిల్లులు మా ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి.

– పద్మ, వెంగళరాజకుప్పం, పాలసముద్రం మండలం

పనిపై ఆసక్తి లేదు



మేం చేసిన పనులకు బిల్లులు రాక పోవడంతో ఉపాధి హామీ పనులకు వెళ్లాలంటే ఆసక్తిగా లేదు. నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉండడంతో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాం. ఒక వైపు వ్యవసాయ పనులు, అంతంత మాత్రంగా ఉండగా దీనికి తోడు ఉపాధిహామీ వేతనాలు అందక పోవడంతో జీవనం కష్టతరంగా మారింది.

– గిరి, పుల్లూరు గ్రామం, శ్రీరంగరాజపురం మండలం

మూడు వారాలు వేతనం అందించాం

18 వారాలు పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో మూడు వారాలకు మాత్రమే బిల్లులు మంజూరు అయ్యాయి. మిగిలిన మొత్తం అందే విధంగా ఇందుకు సంబంధించిఎప్పటికప్పుడు డేటాను సిద్ధం చేస్తున్నాం. త్వరలో మిగిలిన బిల్లులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.

– రవికుమార్, డ్వామా పీడీ, చిత్తూరు

వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

– మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, సదాశివకోన కమిటీ మాజీ చైర్మన్ సదాశివరెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం రోజా గ్రామానికి వెళ్లి సదాశివరెడ్డి కర్మక్రియల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

పరామర్శ

పుత్తూరు రూరల్ మండలం మజ్జిగ గుంట ఎస్టీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ యువత కార్యదర్శి తులసీరామ్ అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం గ్రామానికి వెళ్లి తులసీరామ్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలకు తగిన సూచనలు చేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


పరామర్శలో నాయకులతో మాజీ మంత్రి ఆర్కే రోజా

అంతరిక్ష శాస్త్రవేత్తల కృషి అభినందనీయం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: అంతరిక్ష పరిశోధన విజ్ఞాన శాస్త్రవేత్తల కృషిని కొనయాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి అన్నారు. గురువారం కళాశాలలో అంతరిక్ష పరిశోధనల్లో విప్లవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా అంతరిక్ష వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. చంద్రయాన్, ఆదిత్య-1, మంగళయాన్ ప్రయోగాలతోపాటు 400 విదేశీ ఉపగ్రహాలను సైతం అంతరిక్షంలోకి పంపిన ఘనత భారత దేశానికి దక్కిందన్నారు. శాస్త్రవేత్తలు సాధించిన విజయాల నుంచి విద్యార్థులు ప్రేరణ పొంది ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగం అధ్యక్షుడు సురేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ మన్యం నరసింహులు, అధ్యాపకులు సుజల, స్వప్న, స్మిత, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా తదితరులు

విజయపురం: శ్రీహరిపురం ఎంపీటీసీ డి.లక్ష్మీపతిరాజు భార్య గీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం గీత కర్మక్రియల కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మీపతిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాలాజీ, ప్రసన్న, శేఖర్‌రాజు, రామకృష్ణరాజు, భాస్కర్‌రెడ్డి, పరంధామన్, ప్రతాప్, నాగేంద్ర ఉన్నారు.

మహిళలకు వైద్య సేవలు

నగరి: బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. మండల వైద్యాధికారులు, వైద్య నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్యాధికారి మోహన రూప, నగరి ఏరియా హాస్పిటల్ వైద్యనిపుణులు జెరీనా, వైద్యులు కార్తికేయన్, లోకేష్, శ్రీనాథ్, కీర్తిప్రియ, సర్పంచ్ రవి, ఎంపీటీసీ జ్యోతి, ఎంపీహెచ్ఈఓ జనార్దన్, సూపర్‌వైజర్లు బాబు, సుశీలమ్మ, శంకర్ రాజు, సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. దామరపాకం సచివాలయ పరిధిలో సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని పోషకాహారం ఆవశ్యకత, పోషకాహార తయారీ విధానాలను వివరించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

పుత్తూరు: వరకట్నం కోసం వేధింపులకు గురైన మహిళ గురువారం పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఎన్జీఓ కాలనీకి చెందిన కె.అరుణ(35)కు నాగలాపురం మండలం బైటకొడియంబేడు గ్రామానికి చెందిన పి.రాకేష్‌తో వివాహం జరిగింది. అప్పట్లో అరుణ కోసం ఆమె భర్తకు వరకట్నం, నగలు అందజేశారు. వీరికి ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాకేష్ అత్త మునెమ్మ, మామ మాణిక్యం అరుణను అదనంగా కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో గురువారం ఆమె పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి


సీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధి నిర్వాహణలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని ఎక్సరే, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అవసరమైన మందులను స్టాక్ ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సీహెచ్‌సీ ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలించారు.

తెలుగు భాషపై మక్కువ చూపాలి


మాట్లాడుతున్న మేడసాని మోహన్

పాలసముద్రం: విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ చూపాలని శతావధాని మేడసాని మోహన్ తెలిపారు. బలిజకండ్రిగ హైస్కూల్‌లోని బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని హరిత, ఎంఈఓ గిరిజ సమీక్షంలో తెలుగు (భాగవతోపన్యాసం) మందార మకరందాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి వెలిగించి, సరస్వతి పూజలు చేశారు. ముఖ్య అతిథి మేడసాని మోహన్ మాట్లాడుతూ మహాభారతం, శ్రీకృష్ణదేవరాయలు చరిత్రను వివరించారు. తెలుగు వేమన పద్యాలను పాడి వినిపించారు. మాజీ జెడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు, పాలసముద్రం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరాజు, మునిరత్నం నాయుడు, రఘు, చిట్రాజు గోవిందరాజు, రామకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వగురువుగా భారత్


పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు: దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ విశ్వగురువుగా అవతరిస్తుందని బీజేపీ జిల్లా కార్యదర్శి కె.బాబు అన్నారు. ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని బీజేపీ నాయకులు ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరం రోడ్డు సర్కిల్ వద్ద మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానిక దివ్యాంగుల పాఠశాలలో పిల్లలకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన పయనిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ పార్టీ కన్వీనర్ హరిబాబు, ఆపస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, మండల పార్టీ అధ్యక్షుడు గిరిప్రసాద్, నాయకులు చెన్నకేశవ, శ్రీనివాస రెడ్డి, సరసమ్మ, హరికృష్ణ, నాగరాజు, చెంగల్రాయులు, వరలక్ష్మీ, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరించేవారికి 'నమస్తే'


నమస్తే ప్రారంభోత్సవంలో కమిషనర్, శానిటరీ సిబ్బంది

నగరి: పురపాలక పరిధిలో వ్యర్థాలను ఏరుకుని బతికే వారి భద్రత, గౌరవాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ×నమస్తే₹ (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్)ను గురువారం మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్క్రాప్ షాపుల యజమానులకు, డంప్ యార్డులో, రోడ్డు పక్కన ఉండే ప్లాస్టిక్ బాటిళ్లు, పాత బట్టలు తదితర వ్యర్థాలను ఏరుకుని జీవనం సాగించే వారు నగరి పురపాలక సంఘ కార్యాలయంలో, సచివాలయాలలోవివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దీంతో వారికి ఆరోగ్య భద్రత, ప్రభుత్వం నుంచి కలిగే అన్ని ప్రయోజనాలు చేకూరుస్తామన్నారు. వారికి గుర్తింపు కార్డు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, వేస్ట్‌పికర్స్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ కలైవాణి

కార్వేటినగరం: ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ నగరి మేనేజర్ పీఎం కలైవాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా జిల్లా ఎయిడ్స్ నివారణ అలాగే చిత్తూరు జిల్లా స్టెప్స్ నగరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడు అలవాట్లతో హెచ్ఐవీ వ్యాప్తి చెందుతుందన్నారు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష లేకుండా ఉండాలన్నారు. వారిని కూడా సమాజంలో కలసి జీవించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయుడు వేణుగోపాల్, స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అరుల్, భువన, దివ్య, నరేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి


రోగాల నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమశ్రీ

కార్వేటినగరం: మహిళ ఆరోగ్యంగా ఉంటే శక్తిమంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆళత్తూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన


మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

విజయపురం: పన్నూరు ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం జానకిరామరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహేష్‌బాబు మాదకద్రవ్య నిర్మూలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలను వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజేంద్ర, తహశీల్దార్ కిరణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పాలసముద్రం: మండలంలోని బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లో అలిగి రెండు రోజుల క్రితం వెళ్లిపోయింది. వారి బంధువులు ఆమె ఆచూకీ కోసం రెండు రోజులుగా వెతికారు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

క్లుప్తంగా

నేత్ర ప్రదాయినికి మూలస్థాన గడప కవచం


కవచాలను ఈఓకు అందిస్తున్న దాత

నగరి: పట్టణ పరిధిలోని నేత్రప్రదాయిని దేశమ్మ దేవత ఆలయానికి తమిళనాడుకు చెందిన భక్తులు కెప్టెన్ ప్రభాకర్ రూ.70 వేలు మదింపు ఉన్న మూలస్థాన గడప కవచాలను వితరణగా అందించారు. గురువారం ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన ఆలయ ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు కవచాలను అందజేశారు. అమ్మవారికి గడప కవచాలను కానుకగా ఇవ్వాలని ప్రార్థించుకున్నానని, అందుకే కవచాలను అందిస్తున్నానని దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నీలకంఠ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల పంపిణీ


పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న దాత

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలకు గురువారం విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్రమణ్యం కుర్చీలు, స్టూల్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు చేతుల మీదుగా అందజేశారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కలిగి ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు అన్నారు. దాతలు సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దాత సుబ్రమణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు ఎంపీడీఓగా మనోహర్‌గౌడ్


మనోహర్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు ఎంపీడీఓగా మనోహర్‌గౌడ్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా చిట్టమూరు డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయనకు పదోన్నతిపై గంగాధరనెల్లూరు ఎంపీడీఓగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనిత, బుగ్గపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి, నాయకులు వెంకటేష్ రెడ్డి తదితరులు సత్కరించి, స్వాగతం పలికారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


పాలసముద్రం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, జయకుమార్ తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయ వరణంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. వైద్యాధికారి జయకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని, ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. గర్భిణీలు ప్రసవం వరకు మంచి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం 150 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం తూగుండ్రంలోని కల్యాణమండపం వద్ద గ్రామస్తులు, యువకులు ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అర్చకులు శివకుమార్ వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఉభయదారులుగా ఆముదాల దామోదరశెట్టి, లత కుటుంబ సభ్యులు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని వినాయకుని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకున్న ఇంద్రధనస్సు


ఎస్ఎన్ కండ్రిగ వద్ద ఇంద్రధనస్సు

కార్వేటినగరం: అకాల వర్షాలు పంట పొలాలకు పచ్చదనంగా నిలుస్తున్న తరుణంలో గురువారం సాయంత్రం కారు మబ్బుల మధ్య మండలంలోని ఎస్ఎన్ కండ్రిగ గ్రామంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. దీంతో పలువురు వీక్షకులు తమ సెల్‌ఫోన్లతో బంధించారు. చిన్నారులు ఇంద్రధనస్సును చూసి కేరింతలు కొట్టారు.

మండే ఎండ.. ఎడతెరపిలేని వర్షం


పగలు మండుటెండ


సాయంత్రం జోరువర్షం

వాతావరణంలో వచ్చే వినూత్న మార్పులు ప్రజలను అయోమయంలో పడేస్తోంది. కాలాల్లో వచ్చే మార్పుతో ప్రస్తుతం వేసవికాలం నడుస్తుందో వర్షాకాలం నడుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ 34 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉక్కపోత ఎక్కువగా ఉండి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే సాయంత్రం నుంచి వాతావరణం 25 డిగ్రీలకు చేరుకుని, మబ్బులు కమ్ముకుని వరుణుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పడే వర్షం ఉదయం కాసే ఎండకు ఆవిరైపోతోంది. ఇదేమి వాతావరణం అంటూ జనం విస్తుపోతున్నారు. – నగరి